క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ఎంపీ రాజ్యలక్ష్మీ షా



అప్పన్న ఆలయంలో ఎంపీ రాజ్యలక్ష్మీ షా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఎంపీ రాజ్యలక్ష్మీ షా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆమె పేరిట అర్చకులు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటిండెంట్ సునీల్ అందజేశారు. పీఆర్వో నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

పరవాడ: పరవాడ సంతబయలులో కొలువుదీరిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శనివారం ఉదయం 11.11 గంటలకు భూమి పూజ చేయనున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు చెప్పారు. ప్రముఖ సిద్ధాంతి శ్రీమాన్ రేజేటి రామాచార్యులు (రాంబాబు) భూమి పూజ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పెద్దలు, యువత పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

పెందుర్తి సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



సింహాచలం: పెందుర్తి పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కమిషనరేట్ పరిధిలో పలువురు సీఐలను కమిషనర్ త్రివిక్రమవర్మ బదిలీలు చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా వీఆర్‌లో ఉంటూ డీసీపీ లాఅండ్ ఆర్డర్-1 అటాచ్‌లో ఉన్న ఎం.శ్రీనివాసరావును పెందుర్తి స్టేషన్ లా అండ్ ఆర్డర్ సీఐగా నియమించారు.

ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాటం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

గోపాలపట్నం: ఎస్సీలను ఏబీసీడీగా వర్గీకరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి విశాఖ జిల్లా సమావేశం శుక్రవారం గోపాలపట్నం లక్ష్మీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ సాధన అంశంపై మాట్లాడారు. మాదిగ రిజర్వేషన్ కోసం చుస్తున్నా పోరాటాలు ఆగవన్నారు. జిల్లా, వార్డు కార్యవర్గాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని ద్వారా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఐడీ బాబు, చెంగల చిన్నారావు, నత్తల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

'చలో గాజువాక' విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27వ తేదీన నిర్వహించతలపెట్టిన చేనేతల 'చలో గాజువాక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు కోరారు. అగనంపూడి పద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు ఐక్యమత్యంతో, సంఘటితంగా ఉన్నప్పుడే రాజకీయ, సామాజిక మనుగడ సాగించగలమన్నారు. రాజకీయ పార్టీలు తగిన గుర్తింపు నివ్వాలంటే మన సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత చేనేత సంఘం అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్, జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు, శ్రీ పద్మమార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు దొడ్డి దేముడు తదితరులు పాల్గొన్నారు.



దేవీపురంలోని మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తున్న సామూహిక వ్రతాలు



యజ్ఞశాలలో నిర్వహిస్తున్న శోడషోపచార పూజలు

శ్రావణ లక్ష్మీ.. నమోస్తుతే..

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు
- భక్తులతో ఆలయాలు కిటకిట
- విశేషంగా లక్ష్మీదేవికి కుంకుమ పూజలు



ఎస్ఆర్‌పురంలో గాజుల అలంకరణలో దుర్గమ్మ



సింహాచలం వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన లక్ష్మీదేవి

సింహాచలం: వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అంతటా ఆధ్యాత్మిక శోభ ఫరిడవిల్లింది.గృహిణులు ఇళ్లల్లో శ్రావణ లక్ష్మిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. అడవివరం, పెందుర్తిలోని పలు ఆలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. వరలక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు.

- అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మతల్లి ఆలయంలో కుంకుమపూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- సింహాచలేశుడి కొండదిగువ వెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని వేదికపై అధిష్టంపజేశారు. భక్తుల గోత్రనామాలతో కుంకుమపూజ చేశారు.
- 97వ వార్డు సుజాతనగర్ సప్తగిరినగర్‌కాలనీని అలివేలు మంగాదేవి ఆలయంలో ఉదయం 10 గంటలకు లక్ష్మీ సహస్రనామార్చన,విష్ణు సహస్రనామార్చన నిర్వహించారు.
- సుజాతనగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో లక్ష్మీదేవికి సహస్రనామార్చన పూజ ఘనంగా నిర్వహించారు.
- పెందుర్తి మండలం రాంపురంలోని రమా సహిత సత్యనారాయణస్వామి మరియు సంతోషిమాత ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు విశేషంగా నిర్వహించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

97వవార్డు సప్తగిరినగర్‌లోని అలివేలు మంగాదేవి ఆలయంలో శుక్రవారం నుంచి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న బ్రహోత్సవాలకు సంబంధించి సాయంత్రం అంకురార్పణ చేశారు. సాయంత్రం 6గంటల నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, రక్షాబంధనం, యాగశాలార్చన, అంకురార్పణ పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి యాగశాలార్చన, పారాయణం, కుంభవాహనం, హోమాలు, అభిషేకం, ఉదయం 11గంటలకు కల్యాణ మహోత్సవం, సాయంత్రం 6.30గంటలకు తిరువీధి మహోత్సవం నిర్వహించనున్నారు.

దేవీపురంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని శ్రీచక్ర ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో కొలువైన శ్రీమహలక్ష్మి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళా భక్తులకు అమ్మవారికి పూజలు,అభిషేకాలు నిర్వహించారు. మహలక్ష్మి అమ్మవారికి సన్నిధిలో సామూహిక వ్రతాలను, కుంకుమ పూజలు చేశారు. ఉదయం నుంచి అమ్మవారికి క్షీరాభిషేకాలు,శోడషోపచార పూజలు నిర్వహించారు. అనంతరం గురుమాత అన్నపూర్ణమ్మ చేతులమీదుగా అన్నసమారాధన చేపట్టారు.అమ్మవారి కరుణ భక్తుపై ఉండాలని గురుమాత ఆకాంక్షించారు.

వ్యక్తిని బెదిరించి నగదు అపహరణ

- అడవివరంలో ఘటన
- సీసీ పుటేజీ ఆధారంగా ముగ్గురి అరెస్ట్

సింహాచలం: వ్యక్తిని బెదిరించి... ఏటీఎంకి తీసుకెళ్లి నగదు అపహరించిన ఘటన జీవీఎంసీ 98వ వార్డు అడవివరం జంక్షన్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన ఉమామహేశ్వరరావు(25) నేవల్ డాక్‌యార్డులో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. ఉమామహేశ్వరరావు గురువారం చీడికాడవెళ్లి తిరిగి రాత్రి సుమారు 10గంటల సమయంలో వెంకోజీపాలెం వెళ్తూ అడవివరం జంక్షన్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలో మద్యం సేవిస్తున్నాడు. అక్కడికి ముగ్గురు వ్యక్తులు ఆటో, ద్విచక్రవాహనంపై వచ్చారు. నగదు ఇవ్వాలని ఉమామహేశ్వరరావును బెదిరించారు. బలవంతంగా బైకుపై అడవివరంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్దకు తీసుకువెళ్లి ఖాతాల్లో ఉన్న రూ.4 వేలు విత్ డ్రా చేయించి తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. దీంతో ఉమామహేశ్వరరావు కంట్రోల్‌రూమ్‌కి ఫోన్ చేసి విషయం తెలిపాడు. సమాచారం అందుకున్న పెందుర్తి క్రైం ఎస్ఐ సల్మాన్ బేగ్ శుక్రవారం ఉదయం అడవివరంలోని మద్యం దుకాణం పరిసరాలతో పాటు అలాగే యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద పరిశీలన జరిపారు. సీసీ పుటేజీల ఆధారంగా ముగ్గురిని గుర్తించారు. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ఇద్దరిని, ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఒకరిని గుర్తించి అరెస్టు చేశారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం



డ్రై డేపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీసింహాచలం

పెదగంట్యాడ: వారంలో ఒక రోజు.. ప్రతీ శుక్రవారం ప్రతి ఒక్కరూ విధిగా డ్రై డే పాటించాలని జోన్-6 జోనల్ కమిషనర్ సింహాచలం కోరారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి చిన కోరాడ కూడలి వద్ద శుక్రవారం డ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, డ్రమ్ములు, కుండీలపై మూతలు ఉంచాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేస్తే దోమలు వృద్ధి చెంది, రోగాలు వ్యాప్తి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, దొడ్డి శ్రీనివాసరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



వెన్నలపాలెం-ఎన్టీపీసీ రహదారిలో విద్యుత్ స్తంభాన్ని అల్లుకున్న తీగలు



యలమంచిలి రహదారిలో ఊటగెడ్డ కూడలి సమీపంలో...



పరవాడ-తానాం రహదారిలో..

పరవాడ: మండలంలోని పలు చోట్ల విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగల కారణంగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. దీంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాకాలంలో రహదారుల వెంబడి విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకోవడం సర్వసాధారణం. అయితే వాటిని విద్యుత్ శాఖ సిబ్బంది సకాలంలో తొలగించకపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎన్టీపీసీ-వెన్నలపాలెం, పరవాడ-యలమంచిలి, తానాం-పరవాడ రహదారుల్లో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలు తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం మొండి వైఖరి విడనాడాలి



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి ప్రభుత్వరంగ సంస్థల్లో ఒకటైన విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి, ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 925వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎంఎంఎస్ఎం మరియు ఎస్టీఎం విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎందరో వీరుల ప్రాణత్యాగాలు, పోరాటాల ద్వారా నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే ప్రజలు సహించేది లేదన్నారు. పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను, రాయితీలను సమసమాజ స్థాపనకు ఉపయోగపడే విధంగా చేస్తామని ప్రమాణం చేసిన కేంద్ర ప్రభుత్వం.. నేడు పూర్తిగా కార్మికుల హక్కులను కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వ నిర్ణయాన్ని వీడి ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో 28 నుంచి ఉచిత శిక్షణ

గాజువాక : ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఈ నెల 28 నుంచి 29 వరకు ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్టు ఆయుష్ ట్రైనింగ్ డివిజన్ వ్యవస్థాపకుడు డాక్టర్ డి.శ్రీనివాస్ తెలిపారు. గ్లాస్ పెయింటింగ్, పాట్ పెయింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, శిల్పాకార్, క్లే ఆర్ట్, టై అండ్ డై విభాగాల్లో శిక్షణ కొనసాగుతుందన్నారు. నగరంలోని శంకరమఠం రోడ్డులోని ఆయుష్ కేంద్రంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు.

సీనియర్ పౌరులకు అండగా 'హెల్ప్ ఏజ్ ఇండియా'

గాజువాక : సీనియర్ పౌరులకు హెల్ప్ ఏజ్ ఇండియా అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ 72వ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ అన్నారు. చినగంట్యాడలో శుక్రవారం నిర్వహించిన సంస్థ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హెల్ప్ ఏజ్ ఇండియా ఎల్డర్స్ హెల్ప్‌లైన్ ద్వారా సీనియర్ పౌరులకు సహకారం అందుతోందని పేర్కొన్నారు. హెల్ప్ లైన్ నంబర్ 14567కు కాల్ చేస్తే అన్ని రకాల సేవలు అందుతాయని పేర్కొన్నారు. దీన్ని వృద్ధులు ఉపయోగించుకోవాలని కోరారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

సింహాచలం: గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పెందుర్తి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌కు చెందిన స్టీఫెన్‌స్‌రాజ్(25), మహ్మద్ యాసిన్(23)తో పాటు అల్లూరి జిల్లా డుంబ్రిగుడకు చెందిన కిల్లో గోపాల (28) రెండు కిలోల గంజాయి, కేజీ ద్రవరూప గంజాయితో ద్విచక్ర వాహనంపై అరుకు నుంచి పెందుర్తి వస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పెందుర్తి లా అండ్ ఆర్డర్ ఎస్ఐ అసిరి తాత ఆధ్వర్యంలో పోలీసులు బైక్‌ను ఆపగా వారు పారిపోవడానికి ప్రయత్నించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- నరవలో గడప గడపకు మన ప్రభుత్వం



నరవలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పెందుర్తి నియోజకవర్గం పరిధి నరవలోని యాదవ వీధి, పద్మశాలివీధి, శెట్టిబలిజ వీధి, రజకవీధి-1, రజకవీధి-2, వర్తక సంఘం వీధిలో శుక్రవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు.అర్హులై ఉండి సంక్షేమ పథకం అందకపోతే అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వచ్చేలా చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండుకళ్లుగా చేసి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. 95శాతానికి పైగా హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. ఆయన పాలనలో రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. నవరత్నాలతో పాటు అనేక పథకాలు తమకు అందుతున్నాయని ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతీ గడపలోనూ బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ముఖ్యంగా అవినీతికి తావులేకుండా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించడం చరిత్ర అన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందేలా చేయడం జరిగిందన్నారు. అవ్వా తాతలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ పింఛన్ కోసం తిరగకుండా వాళ్ల వద్దకే పింఛన్ సొమ్ము వచ్చేలా జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని చేయాలని కోరారు. కార్యక్రమంలో 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు,జీవీఎంసీ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అప్పన్న దర్శనం చేయిస్తానని భక్తుడికి టోకరా



హైదరాబాద్ నుంచి కుటుంబసమేతంగా దర్శనానికి వచ్చిన భక్తుడు శ్రీరామమూర్తి

సింహాచలం: సింహగిరికి వచ్చిన ఓ భక్తుడికి వరాహ లక్ష్మీ నృసింహస్వామి వీఐపీ దర్శనం కల్పిస్తానని చెప్పి ఓ అజ్ఞాత వ్యక్తి టోకరా వేశాడు. హైదరాబాద్ నుంచి శ్రీరామమూర్తి తన భార్య, కుమారుడితో కలిసి శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో సింహగిరికి వచ్చారు. పాత విచారణ కార్యాలయం వద్ద వారిని ఓ అజ్ఞాత వ్యక్తి కలిసి వీఐపీ దర్శనం, ఆశీర్వచనం, ప్రసాదం అందజేస్తానని చెప్పి రూ.900 తీసుకున్నాడు. అక్కడే ఉండమని చెప్పి వెళ్లాడు. అతని కోసం ఎదురుచూసిన శ్రీరామమూర్తి ఎంతకీ రాకపోయేసరికి.. సింహగిరిపై ఉన్న సహాయక కేంద్రంలో పీఆర్వో అప్పలనాయుడికి ఫిర్యాదు చేశారు. పీఆర్వో, సిబ్బంది సింహగిరిపై అతని కోసం గాలించారు. ఫలితం లేకపోయింది. అతన్ని గుర్తించేందుకు దేవస్థానం సిబ్బంది సీసీ పుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

అట్టహాసంగా ఓనం వేడుకలు



ఇండియన్ మారిటైమ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఓనం పర్వదిన వేడుకలు



సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

సబ్బవరం: ఇండియన్ మారీ టైం విశ్వవిద్యాలయంలో వరలక్ష్మీవ్రతం,ఓనం పర్వదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ డైరెక్టర్ వీకే కేశవదేవ్ ఓనం ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. సిరిసంపదలను తీసుకువచ్చే ఎంతో సంతోషమైన రోజు అని తెలిపారు. పండగను పురస్కరించుకొని వర్సిటీలో రంగవల్లులతో అలంకరించి,జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీల్లో భాగంగా విద్యార్థుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సాంప్రదాయ వంటలతో ఏర్పాటు చేసిన విందు భోజనాలతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ ఎస్. జనార్దనన్,అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి చరణ్, జె. రాజు, ప్రొఫెసర్స్ శ్రీ పద్మ, ఎం. ప్రేమ్ చంద్,జి. అవినాష్, ఎ. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యా యత్నం

రక్షించిన భీమిలి పోలీసులు



రక్షించిన వ్యక్తితో భీమిలి పోలీసులు

భీమునిపట్నం: అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని భీమిలి పోలీసులు గురువారం రాత్రి రక్షించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. పెందుర్తి చినముషిడివాడకు చెందిన పొట్నూరు రవితేజ (34) ఆన్‌లైన్ ఆటలకు బానిసై సుమారు రూ.15లక్షల వరకు బ్యాంకుల దగ్గర అప్పు చేశాడు. వారి నుంచి ఒత్తిడి పెరగడంతో స్విగ్గీ డెలివరీకి వెళ్తున్నానని సాయంత్రం 7 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 10.30 గంటల సమయంలో అప్పుల వివరాలు, తప్పులు తన బావకు వాట్సాప్‌లో మెసేజ్ పెట్టి, సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకుంటానని తెలిపాడు. దీంతో వారు 100కి ఫోన్ చేయడంతో నైట్ డ్యూటీలో ఉన్న ఎస్ఐ హరీష్, ఇతర పోలీసు సిబ్బంది గాలింపు చేపట్టారు. భీమిలి బీచ్‌రోడ్డులో ఎర్రమట్టి దిబ్బల ఎదురుగా సదరు వ్యక్తిని రక్షించారు. అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు.

అధునాతన ఔషధాలతో క్యాన్సర్ నివారణ



డాక్టర్ మాధవిని సన్మానిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : క్యాన్సర్ వ్యాధి నివారణకు అధునాతన పద్ధతులు, ఔషధాలు వచ్చాయని అమెరికాలో స్థిరపడ్డ ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థిని, ప్రముఖ మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ గొరుసు మాధవి అన్నారు. శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కామన్ టీచింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా «ప్రివెన్షన్ మెడిసిన్-అంకాలజీ»అన్న అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాల వల్ల ప్రపంచంలో క్యాన్సస్ వ్యాధి పెరుగుతోందని అన్నారు. మద్యం, ధూమపానం, వంశపారంపర్యంగా ఈ వ్యాధి సోకుతోందన్నారు. తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు, ఏఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యం, కేజీహెచ్ మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, డాక్టర్ పీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవిని ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.